సాక్షి
మహబూబ్‌నగర్
ఆదివారం । 22 । జనవరి । 2023

గరిష్ఠం/కనిష్ఠం
30.1 /16.7
వాతావరణం
ఉదయం ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీస్తాయి. ఉదయం, రాత్రివేళ చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జైలులో లోక్ అదాలత్



మహబూబ్‌నగర్ క్రైం: మహబూబ్‌నగర్ జిల్లా జైలులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో నాగర్‌కర్నూల్ జిల్లాకు సంబంధించి కేసులను రాజీ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రాజేష్‌బాబు ఆదేశాల మేరకు కొల్లాపూర్ రెండో అదనపు న్యాయమూర్తి మిథున్ తేజ జైలులో లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో కొల్లాపూర్ కోర్టు పరిధిలోని ఆరు కేసులు, కల్వకుర్తి కోర్టు పరిధిలోని నాలుగు కేసులు, నాగర్‌కర్నూల్ కోర్టు పరిధిలో ఒక కేసు రాజీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఖైదీలు బయటకు వెళ్లిన పూర్తిగా సత్ప్రవర్తనతో మెలగాలని, చోరీలు, ఇతర నేరాలు చేసి మళ్లీ జైలుకు రావొద్దన్నారు. మంచి జీవనం సాగించి, కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ వెంకటేశం, జైలర్ శ్రీనివాస్, విజయ్ మోహన్, లీగల్ కౌన్సిలర్స్ సత్యం, శ్రీనివాసులు, రాములు పాల్గొన్నారు.

సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వం రెండోవిడత కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తుండటం అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. కంటి వెలుగుపై శనివారం ఆమె హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, వైద్య, ఆరోగ్య శాఖల అధికారులతో వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటివెలుగుకు సంబంధించి ఎంఐఎస్ నివేదికలు ఎప్పటికప్పుడు పంపాలని, క్వాలిటీ కంట్రోల్ బృందాలు అన్ని వైద్య శిబిరాలు సందర్శించేలా చూడాలన్నారు. ప్రస్తుతం అన్ని జిల్లాల్లో శిబిరాలు బాగా నిర్వహిస్తున్నప్పటికీ ఇంకా మెరుగైన సేవలందించేలా కలెక్టర్లు చొరవ తీసుకోవాలన్నారు. కళ్లద్దాల పంపిణీ అతి ముఖ్యమని, దీనిని కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకట్రావ్, అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, డీఎంహెచ్‌ఓ కృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్, కంటి వెలుగు ప్రాజెక్ట్ ఆఫీసర్ వినోద్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు ప్రదీప్‌కుమార్, నూరుల్ నజీబ్, మహమ్మద్ షైక్, జిల్లా పశుసంవర్ధక అధికారి మధుసూదన్, డీపీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కొత్త కలెక్టరేట్‌లో క్యాంటీన్ ఏర్పాటు కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అదనపు కలెక్టర్ సీతారామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంటీన్ నిర్వహణలో మూడేళ్ల అనుభవం ఉండాలని, మహిళా సంఘాల సభ్యులకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ఆసక్తి గలవారు https://mahabubnagar.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 31 సాయంత్రం 5 గంటల వరకు కలెక్టరేట్ ఏఓకు సమర్పించాలని కోరారు.

నేడు రథయాత్ర

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలో ఆదివారం సీతారాముల విజయోత్సవ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహక ప్రతినిధులు రాజమల్లేష్, సురేందర్‌గౌడ్, కొండప్ప, నక్కల్, దత్తురావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ఇస్కాన్ టెంపుల్ అధ్యక్షుడు మహశ్రింగ్‌దాస్ ప్రభూజీ నేతృత్వంలో రథయాత్ర చేపడుతున్నామన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఏనుగొండలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభమై మెట్టుగడ్డ మీదుగా.. న్యూటౌన్, కొత్త బస్టాండ్, అశోక్ టాకీస్ చౌరస్తా, గడియారం చౌరస్తా, రాంమందిర్, వన్‌టౌన్ చౌరస్తా, పాతపాలమూరు, భగీరథ కాలనీ కమాన్ వరకు రథయాత్ర సాగుతుందన్నారు. రథయాత్రలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

అడ్డగోలుగా కమిటీలు!

హన్వాడ ఐకేపీలో ఇష్టారాజ్యంగా కార్యకలాపాలు
- ఎస్‌హెచ్‌జీతో సంబంధం లేకున్నా మండల సమాఖ్యలో పదవులు
- ఏడాదిగా కొనసాగుతున్నా పట్టించుకోని వైనం
- ఆర్టీఐ దరఖాస్తుతో కదిలిన డీఆర్‌డీఓ అధికారులు
- తప్పులను కప్పిపుచ్చుకునేందుకు మొదలైన ప్రయత్నాలు



హన్వాడ మండలం పెద్దదర్‌పల్లి గ్రామంలో ఇటీవల నిర్వహించిన గ్రామ సంఘం సమావేశంలో సంస్థాగత నిర్మాణంపై సూచనలు చేస్తున్న ఏపీఎం, సీసీలు

జిల్లాలోని ఓ మండలానికి కొత్తగా వచ్చిన ఏపీఎం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సంస్థాగత నిర్మాణంపై దృష్టిసారించారు. ఈ క్రమంలో చిన్న సంఘాల్లో సభ్యులుగా ఉండి మండల సమాఖ్యలో అధ్యక్షులుగా, గ్రామ సంఘాల్లో అధ్యక్షులుగా లేకపోయినా మండల సమాఖ్యలో మరో పదవిలో కొనసాగడం వంటి విషయాలు బయటపడటంతో అవాక్కయ్యారు. అంతేకాకుండా సంస్థాగత నిర్మాణంలో లోపాల కారణంగా రికవరీలు సైతం మందగించాయి. మండల సమాఖ్యలో ఇప్పటి వరకు జరిగిన లావాదేవీలు, చెక్‌పవర్ కలిగిన ముగ్గురు లీడర్ల నియామకాలతో పాటు తన పరిశీలనలో నిబంధనలకు విరుద్ధంగా చోటుచేసుకున్న అంశాలను జిల్లా అధికారులకు నివేదించారు.

మహబూబ్‌నగర్ న్యూటౌన్/హన్వాడ: గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడే స్వయం సహాయక సంఘాలు గాడితప్పుతున్నాయి. ఉద్దేశ పూర్వకంగానో.. లేక రాజకీయ ఒత్తిళ్ల కారణమో.. కానీ, నిబంధనలకు గాలికొదిలి పదవుల కేటాయింపు జరుగుతోంది. 1995 మ్యాక్స్ యాక్టు ప్రకారం చిన్న సంఘాల్లో అధ్యక్షురాలిగా ఉన్నవారే గ్రామ సంఘంలో అధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారి పదవుల్లో ఉండాలి. అలాగే గ్రామ సంఘం, చిన్నసంఘంలో అధ్యక్షురాలుగా ఉన్న వారు మాత్రమే మండల సమాఖ్య అధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారులుగా వ్యవహరించాలి. కానీ, ఇక్కడ మాత్రం మండల మహిళా సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా బైలా నిబంధనలు పాటించకుండా పదవులు కేటాయించడం, ఏడాదికిపైగా వారే పదవుల్లో కొనసాగుతూ కార్యకలాపాలు సాగిస్తున్నారు. దీనిపై సమాచార హక్కుచట్టం దరఖాస్తుతో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీనిపై డీఆర్‌డీఓ అధికారులు దృష్టిసారించడంతో.. ఇన్నాళ్లు చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తూ.. ఏకంగా మండలాల్లోని ఐకేపీ సిబ్బందిని హెచ్చరించడం వరకు చేరుకున్నాయి.

అయితే స్వయం సహాయక సంఘాల్లో జరిగిన సంస్థాగత నిర్మాణాలను సరిచేసేందుకు మండల ఐకేపీ సిబ్బందితో పాటు డీఆర్‌డీఓ అధికారులు రంగంలోకి దిగారు.

జిల్లా పరిధిలో ఇలా..

జిల్లాలోని 15 మండల సమాఖ్యల పరిధిలో 11,674 మహిళా స్వయం సహాయక సంఘాలు, 474 గ్రామ సంఘాలు ఉన్నాయి. మొత్తం 1,24,750 మంది మహిళలు ఆయా సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. ప్రతినెలా రెండుసార్లు చిన్న సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమాఖ్యల సమావేశాలు నిర్వహిస్తారు. లావాదేవీలు, జీవనోపాధులు, రుణాలు, శ్రీనిధి, సీసీ రుణాల అందజేత, వసూళ్ల వంటి అంశాలపై చర్చిస్తారు. తాజాగా బయటపడిన పొరపాట్లను సరిచేసే క్రమంలో జిల్లావ్యాప్తంగా ఉన్న సంఘాల సమావేశాలు, గ్రామ సంఘాలు, మండల సమాఖ్యలపై దృష్టిసారించారు. సంస్థాగత నిర్మాణాల్లో జరిగిన లోపాల సవరణకు చర్యలు చేపట్టారు.

పనితీరు.. అభాసుపాలు

ప్రస్తుత పరిస్థితుల్లో మహిళా శక్తిని ప్రధానంగా చూపాలంటే మహిళా స్వయం సహాయక సంఘాల పనితీరు, సాధించిన అభివృద్ధిని ప్రస్తావిస్తాం. సంఘాలు ఆర్థిక వృద్ధితో పాటు సాధించిన విజయాలు చర్చకు వస్తాయి. మహిళల్లో ఐక్యత, సమానత్వం, ఆర్థిక వృద్ధి సాధించడంలో మహిళా స్వయం సహాయక సంఘాల పాత్ర ఎనలేనిది. అయితే అక్కడక్కడా అధికారుల అలసత్వం, రాజకీయ నాయకుల పెత్తనం కారణంగా రానురాను మహిళా సంఘాల పనితీరు అభాసుపాలవుతోంది. ఇటీవల జిల్లాలోని చాలా గ్రామ సంఘాలు, మండల సమాఖ్యల్లో బయటపడిన వాస్తవాలే ఇందుకు నిదర్శనం. ప్రశ్నించేవారు లేకపోతే అన్నీ షరా మామూలుగానే జరిగిపోతాయనే దానికి తాజాగా ఐకేపీలో బయటపడిన సంస్థాగత నిర్మాణాలు అద్దం పడుతున్నాయి. అడ్డగోలుగా కమిటీల నిర్మాణం చేపట్టి చేతులు దులుపుకొన్న అధికార యంత్రాంగం తాజాగా సమాచార హక్కు చట్టం దరఖాస్తుతో ఉలిక్కి పడుతున్నారు. అన్ని మండలాల్లో సంస్థాగత నిర్మాణం సరిగ్గానే జరిగిందా.. లేదా అనే దానిపై దృష్టిసారిస్తున్నారు. పేదరిక నిర్మూలనకు తోడ్పాటునందించే స్వయం సహాయక సంఘాల పనితీరు రోజురోజుకు ప్రశ్నార్థకంగా మారుతోంది. సంఘాలను పటిష్టంగా తీర్చిదిద్దడం, మహిళా సాధికారతకు ప్రాముఖ్యత ఇవ్వడంతో పాటు ఆర్థిక వృద్ధి సాధించే దిశగా పనిచేయాల్సిన కిందిస్థాయి సిబ్బంది అలసత్వం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఆశించిన లక్ష్యాల సాధనకు ఎలాంటి అవరోధాలు ఎదురవుతున్నాయో తాజా సంఘటనలతో స్పష్టమవుతోంది.

రేపు జిల్లా సమాఖ్య సమావేశం

జిల్లా మహిళా సమాఖ్య సమావేశం సోమవారం నిర్వహించనున్న దృష్ట్యా అప్పటిలోగా సంస్థాగత నిర్మాణాలను పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా సంస్థాగత నిర్మాణాలు పూర్తిచేసి జిల్లా సమాఖ్య సమావేశంలో వివిధ అంశాలపై చర్చించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

సరిచేసుకుంటాం..

జిల్లాలో కొన్నిచోట్ల స్వయం సహాయ సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమాఖ్యల్లో సంస్థాగత నిర్మాణంలో తప్పులు జరిగాయి. దీనిని సరిచేసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రొటేషన్ ఆఫ్ లీడర్‌షిప్ విషయంలోనూ దృష్టిసారిస్తున్నాం. గ్రామస్థాయి నుంచి మరోసారి సంఘాల నిర్మాణం తీరుపై దృష్టిసారించి సమావేశాలు నిర్వహించి తప్పులు జరిగితే సరిచేసుకోవాలని ఆయా మండలాల ఐకేపీ సిబ్బందికి సూచించాం.

– నాగమల్లిక, డీపీఎం

ప్రభుత్వ లక్ష్యాలను నీరుగార్చొద్దు

- జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి
- ముగిసిన స్టాండింగ్ కమిటీ సమావేశాలు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికార యంత్రాంగం పనిచేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నీరుగార్చొద్దని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం జెడ్పీలోని తన చాంబర్‌లో నిర్వహించిన నిర్మాణం– పనులు స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని చెప్పారు. వ్యవసాయ బోర్ల కనెక్షన్లకు దరఖాస్తు చేసుకున్న రైతలకు వెంటనే ఇవ్వాలన్నారు. గండేడ్ మండలంలో ఏడేళ్ల నుంచి బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి కావడం లేదని జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి సభ దృష్టికి తెచ్చారు. నవాబుపేట మండలంలోని కారూర్ రోడ్డు పనులు ఎప్పటికి పూర్తి చేస్తారని జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి అధికారులను ప్రశ్నించారు.

లోపాలను అధిగమించాలి

జిల్లావ్యాప్తంగా తరచుగా మిషన్ భగీరథలో తలెత్తుతున్న లోపాలను అధిగమించాలని జెడ్పీ చైర్‌పర్సన్ అన్నారు. ఫైనాన్స్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పైప్‌లైన్ కోసం రోడ్లను తవ్వి వదిలేయకుండా వెంటనే మరమ్మతు చేపట్టాలన్నారు. భూత్పూర్, దేవరకద్ర మండలాల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్లను నాసిరకంగా వేశారని మూసాపేట్ జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్ అధికారుల దృష్టికి తెచ్చారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని సాంఘిక సంక్షేమ స్టాండింగ్ కమిటీ చైర్మన్ కల్యాణి అన్నారు. స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థులకు ఇస్తున్న స్కాలర్‌షిప్ జాప్యం లేకుండా చూడాలన్నారు. బాలానగర్ మండలంలోని ఉడిత్యాల, చిన్నరేవల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు.

పీఆర్‌ను ఇంజినీరింగ్ శాఖను తరలించొద్దు

జెడ్పీ కార్యాలయంలోని మొదటి అంతస్తులో ఉన్న పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ డివిజన్ కార్యాలయాన్ని కొత్త కలెక్టరేట్‌కు తరలించొద్దని జెడ్పీటీసీ సభ్యులు తీర్మానించారని జెడ్పీ చైర్‌పర్సన్ తెలిపారు. స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో జెడ్పీటీసీల డిమాండ్ మేరకు డివిజన్ కార్యాలయాన్ని జెడ్పీలోనే ఉంచాలని తీర్మానించిన కాపీని కలెక్టర్ వెంకట్రావ్‌కు పంపినట్లు చెప్పారు. జెడ్పీ ఆధ్వర్యంలో జరిగే అభివృద్ధి పనులు పీఆర్ పరిధిలోనే జరుగుతాయని, తమ శాఖ పరిధిలో ఉండే ఈ కార్యాలయాన్ని తరలిస్తే ఇబ్బందులు వస్తాయన్నారు. ఆయా సమావేశాల్లో జెడ్పీసీఈఓ జ్యోతి, మిషన్ భగీరథ ఈఈ పుల్లారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు అన్నపూర్ణ, శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌కార్డుల పారబోతపై.. పోస్టల్ అధికారుల విచారణ



నాగసాలలో సీజ్ చేసిన కార్డులను పరిశీలిస్తున్న పోస్టల్ శాఖ అధికారులు

జడ్చర్ల: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని నాగసాల కుంటచెరువులో పెద్దఎత్తున ఆధార్ కార్డులు పారబోసిన సంఘటన కలకలం రేపింది. వీటిపై శనివారం బాదేపల్లి పోస్టల్ శాఖ అసిస్టెంట్ పోస్టాఫీసర్ రవికుమార్, పోస్ట్‌మాస్టర్ కుమార్‌గౌడ్ విచారించారు. ఘటనా స్థలానికి వెళ్లి ఆధార్ తదితర కార్డులను స్వాధీనపర్చుకున్నారు. అయితే అప్పటికే తహసీల్దార్ లక్ష్మీనారాయణ పారబోసిన ఆధార్‌కార్డుల వ్యవహారాన్ని కలెక్టర్ వెంకట్రావ్ దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ లభించిన దాదాపు మూడు బస్తాల ఆధార్, ఏటీఎం కార్డులు, వివిధ బ్యాంకుల చెక్ బుక్కులు, పోలీస్ శాఖ ఈ–చలాన్లు స్వాధీనం చేసుకుని నాగసాల మున్సిపల్ వార్డు కార్యాలయానికి తరలించారు. తదుపరి కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చెప్పారు. పారబోసిన ఆధార్ తదితర కార్డులు బాదేపల్లి పోస్ట్ ఆఫీస్‌కు సంబంధించినవి అని అధికారులు ప్రాథమిక నిర్ధారించారు.

2020 నుంచి..

పారబోసిన ఆధార్ తదితర కార్డులను పరిశీలిస్తే 2021, 2022 సంవత్సరాల్లో ప్రధాన కార్యాలయాలు, ఇతర ప్రాంతాల నుంచి చిరునామాల వారిగా వచ్చినట్లుగా పోస్టల్ అధికారులు తెలిపారు. బాదేపల్లిలోని వివిధ కాలనీల అడ్రస్‌ల తోపాటు సమీప తండాలకు సంబంధించినవి కూడా ఉన్నాయి. ఆయా చిరునామాల ఆధారంగా పోస్ట్‌మాన్లను గుర్తించి చర్యలు తీసుకునే అవకాశం ఉందని పోస్టల్ అధికారులు పేర్కొంటున్నారు. ఇన్నాళ్లు మంచి సేవలు అందిస్తున్నారని అనుకున్న పోస్టల్ శాఖ సేవలపై ఈ సంఘటన తర్వాత ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తమకు చాలా ఉత్తరాలు, బ్యాంకుల చెక్‌బుక్‌లు, ఏటీఎం, ఇతర కార్డులు అందజేయాల్సిన పోస్టల్ శాఖ సిబ్బంది ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని విమర్శిస్తున్నారు.

3,502 మందికి అద్దాలు పంపిణీ

పాలమూరు: జిల్లాలో శనివారం మూడోరోజు మూడు పీహెచ్‌సీల పరిధిలో కంటివెలుగు పరీక్షలు నిర్వహించారు. భూత్పూర్ మున్సిపాలిటీలోని రెండో వార్డులో 216 మందికి కంటి పరీక్షలు చేసి 23 మందికి రీడింగ్ అద్దాలు అందజేయగా మరో 27 మందికి దూరచూపు సమస్య అద్దాలకు ఆర్డర్ పెట్టారు. దీంతోపాటు గండేడ్ పీహెచ్‌సీ పరిధిలోని ఆశిరెడ్డిపల్లిలో 172 మందికి కంటి పరీక్షలు చేసి 45 మందికి అక్కడే రీడింగ్ అద్దాలు ఇవ్వగా.. మరో 16 మందికి ఆర్డర్ పెట్టారు. నవాబుపేట పీహెచ్‌సీ పరిధిలోని లింగన్నపల్లిలో 207 మందికి కంటి పరీక్షలు చేసి 23 మందికి అద్దాలు అందజేయగా.. మరో 12 మందికి ఆర్డర్ పెట్టారు. జిల్లావ్యాప్తంగా మూడు రోజుల్లో 14,456 మందికి కంటి పరీక్షలు నిర్వహించి.. 3,502 మందికి రీడింగ్ అద్దాలు అందజేశారు. దూరచూపు సమస్య ఉన్న 2,252 మందికి అద్దాలు ఆర్డర్ పెట్టారు. భూత్పూర్‌లో నిర్వహించిన కంటి వెలుగు పరీక్షలను డీఎంహెచ్‌ఓ కృష్ణ పరిశీలించారు.



భూత్పూర్‌లో కంటి అద్దాలు అందజేస్తున్న వైద్య సిబ్బంది, నాయకులు



మన్ననూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కాటేజీలు

సరికొత్తగా సఫారీ



సఫారీ వాహనం

- నల్లమలలో 26 నుంచి టైగర్ స్టే ప్యాకేజీ ప్రారంభం
- 24 గంటలపాటు అడవిలో సేదదీరేలా ప్యాకేజీ
- కొత్తగా అందుబాటులోకి ఎనిమిది సఫారీ వాహనాలు
- ఎకో టూరిజంలో భాగంగా అటవీశాఖ వినూత్న కార్యక్రమాలు



సండే స్పెషల్

సాక్షి, నాగర్‌కర్నూల్: నల్ల మలలోని అటవీ అందాలు, పులులు, వన్యప్రాణులను ప్రత్యక్షంగా చూసి పులకరించేలా అటవీశాఖ ప్రత్యేక కార్యక్రమాలను అమలు పరుస్తోంది. ఎకో టూరిజంలో భాగంగా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో టైగర్ స్టే ప్యాకేజీలను రూపొందించింది. ఇందుకోసం సరికొత్తగా కాటేజీలు, ట్రీ హౌజ్ కాటేజీలను వినూత్నంగా తీర్చిదిద్దింది. టైగర్ రిజర్వ్‌లోని పులులు, వన్యప్రాణులను ప్రత్యక్షంగా దగ్గరి నుంచి వీక్షించేందుకు, ఎక్కువ మందికి టైగర్ సఫారీ అవకాశం కల్పించేందుకు వీలుగా కొత్తగా మరో ఎనిమిది సఫారీ వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. ఈనెల 26 నుంచి అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో అటవీ శాఖ రూపొందించిన 'టైగర్ స్టే ప్యాకేజీ' ప్రజలకు అందుబాటులోకి రానుంది. 24గంటల పాటు అడవిలో గడిపేలా స్టే ప్యాకేజీని రూపొందించింది. ప్యాకేజీలో భాగంగా స్థానిక చెంచులతో మమేకం కావడంతో పాటు వారి వంటకాలను రుచి చూసే అవకాశం పర్యాటకులకు కలుగనుంది.

విస్తృతం కానున్న టైగర్ స్టే, సఫారీ సేవలు



నల్లమలలో అడవిలో ఒక రోజంతా పూర్తిగా గడిపి ఇక్కడి వన్యప్రాణులు, వందల రకాల వృక్షజాతులు, అటవీ పరిస్థితులపై అవగాహన పెంచుకునేందుకు అటవీ అధికారులు టైగర్ స్టే ప్యాకేజీని రూపొందించారు. రాత్రివేళ అటవీప్రాంతంలోని మన్ననూర్ వద్ద బస చేసేందుకు రూ.90 లక్షలతో కొత్తగా ఆరు కాటేజీలను నిర్మించారు. ఇందులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్రీ హౌస్‌తో పాటు రెండు మడ్ హౌస్‌లు ఆకట్టుకుంటున్నాయి. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లోని చెక్‌పోస్టు నుంచి ఫర్హాబాద్ వ్యూ పాయింట్ వరకు సఫారీ వాహనంలో వెళ్లి వన్యప్రాణులను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఇందుకోసం రూ.1.20 కోట్లతో 8 నూతన సఫారీ వాహనాలను కొనుగోలు చేశారు. త్వరలో ఉమామహేశ్వరం ఆలయం నుంచి రుషుల చెరువు వరకు, అక్కడి నుంచి దోమలపెంట వరకు సఫారీ టూర్‌ను విస్తరించనున్నారు. టైగర్ స్టే ప్యాకేజీ బుకింగ్‌ను ఈనెల 26నుంచి ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో ఉంచుతారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలు..

నల్లమలలోని హైదరాబాద్–శ్రీశైలం ప్రధాన రహదారికి ఇరువైపులా శ్రీశైలం యాత్రికులు వేసే ప్లాస్టిక్ వ్యర్థాలు వన్యప్రాణుల పాలిట శాపంగా మారుతున్నాయి. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ను ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రత్యేక కార్యచరణ చేపట్టారు. నిత్యం అటవీశాఖ సిబ్బంది ద్వారా రహదారికి ఇరువైపులా ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించి మన్ననూర్‌లో ఏర్పాటుచేసిన ప్లాస్టిక్ సెగ్రిగేషన్, బేలింగ్ సెంటర్‌కు తరలిస్తున్నారు. అక్కడి నుంచి రీసైక్లింగ్ కోసం ఇతర ప్రాంతాలకు పంపుతున్నారు. వన్యప్రాణుల సంరక్షణ, వాటి బాగోగులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు సోలార్ విద్యుత్ సహాయంతో నడిచే అధునాతన కెమెరాలను ఏర్పాటుచేశారు. వీటి ద్వారా వాటి పరిస్థితిని ఎప్పటికప్పుడు ఈ– సర్వేయలెన్స్ విధానంలో కార్యాలయం, సెల్‌ఫోన్ నుంచే పర్యవేక్షించేందుకు అవకాశం ఉంటుంది.

స్థానిక చెంచులే టూరిస్టు గైడ్‌లు..



నల్లమలను సందర్శించే పర్యాటకులకు ఇక్కడి వన్యప్రాణులు, వందల రకాల వృక్ష జాతులు, రకరకాల పక్షుల గురించి అవగాహన కల్పించేందుకు స్థానిక చెంచు యువకులు గైడ్‌గా వ్యవహరిస్తారు. ఇందుకోసం ఇప్పటికే 19 మంది యువకులకు అధికారులు శిక్షణ ఇచ్చారు. టైగర్‌స్టే ప్యాకేజీలో భాగంగా పర్యాటకులు స్థానిక చెంచులతో మమేకమై వారి ఆటాపాటలను వీక్షించేలా ఏర్పాట్లు ఉంటాయి. ఇక్కడికి వచ్చే సందర్శకులకు స్థానిక చెంచులు తయారు చేసిన వంటకాలను వడ్డించడం మరో విశేషం. ఎకో టూరిజంలో భాగంగా స్థానికంగా ఉన్న చెంచులను గైడ్లు, డ్రైవర్లు, ఫారెస్ట్ వాచర్లుగా నియమించడం ద్వారా అటవీశాఖ వారికి ఉపాధి కల్పిస్తోంది.

టైగర్ స్టే ప్యాకేజీ వివరాలు..

కాటేజీల్లో బస, టైగర్ సఫారీ, ట్రెక్కింగ్, బయోలాజికల్ ల్యాబ్, సీబీఈటీలో అడవి, వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీశాఖ చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నారు.

సాధారణ కాటేజీలు (ఇద్దరికి)	చీతల్ (బాల్కనీ వ్యూ) (ఇద్దరికి)	చెంచు హట్ - మడ్ హౌజ్‌లు(ఇద్దరికి)	ఫర్హా ట్రీ హౌజ్ (ఇద్దరికి)
రూ. 4,600	రూ. 6,000	రూ. 7,000	రూ. 8,000

(మధ్యాహ్నం 12 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 10 గంటల వరకు ఉంటుంది.)

బుకింగ్ కోసం ఆన్‌లైన్‌లో
www.amrabadtigerreserve.com



శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ఆక్టోపస్ వ్యూ..

మాకు తెలిసిందంతా పర్యాటకులకు చెబుతాం..



అటవీ అధికారులు మాకు పది రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. అడవిలోని వన్యప్రాణులు, మొక్కలు, పక్షుల గురించి మాకు తెలిసినవన్నీ టూరిస్టులకు వివరంగా చెబుతాం. ట్రెక్కింగ్ సమయంలో కన్పించే పక్షుల గురించి వివరిస్తాం. మా ఆచారాలు, పద్ధతుల గురించి పర్యాటకులు ఆసక్తిగా అడిగి తెలుసుకుంటున్నారు.

– విజయ్, గైడ్, చెంచు యువకుడు, పెట్రాల్‌చేను, అమ్రాబాద్ మండలం

అడవి గురించి తెలుసుకునేందుకే ప్యాకేజీ..



అడవిలోని పరిస్థితులపై ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకే టైగర్ స్టే ప్యాకేజీ రూపొందించాం. అడవులు, పర్యావరణ ప్రాముఖ్యతపై అర్థమయ్యేలా వివరిస్తున్నాం. అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతూనే ఎకో టూరిజంలో భాగంగా పర్యాటకులకు అడవిని వీక్షించే అవకాశం కల్పిస్తున్నాం.

– రోహిత్‌రెడ్డి, ఐఎఫ్ఎస్ అధికారి, డీఎఫ్ఓ

క్లుప్తంగా

వ్యక్తి అనుమానాస్పద మృతి

రాజోళి: మండలంలోని పచ్చర్లలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. పచ్చర్లకి చెందిన శేఖర్(56) కూలీ పనులు చేసుకుంటూ ఉండేవాడు. కాగా శనివారం తెల్లవారుజామున ఇంట్లో లేకపోవడంతో కుటుంబసభ్యులు బయట వెళ్లి చూడగా సమీపంలోని గుడిసె వద్ద మృతి చెంది ఉన్నారన్నారు. అయితే తన భర్త మృతిపై పలు అనుమానాలున్నాయని పేర్కొన్నారు. మృతుడి భార్య పార్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనువాసులు తెలిపారు.

24 గొర్రెల అపహరణ

భూత్పూర్: మండలంలోని శేరిపల్లి(హెచ్) గ్రామ సమీపంలోని షెడ్డులో ఉన్న శుక్రవారం అర్ధరాత్రి 24 గొర్రెలు చోరీకి గురైనట్లు బాధితుడు రాంచంద్రయ్య తెలిపారు. ప్రతి నిత్యం మాదిరిగా వ్యవసాయ పొలం వద్ద ఉన్న షెడ్డులో గొర్రెలను ఉంచి తాళంవేసి ఇంటికి వచ్చానని, శనివారం ఉదయం పొలం వద్ద ఉన్న షెడ్డు వద్దకు తాళం విరగొడ్డి గొర్రెలు కనిపించలేదని, చుట్టుపక్కల పరిసర వ్యవసాయ పొలాల్లో చూస్తే తెలియరాలేదని, గుర్తు తెలియని వ్యక్తులు దొంగతం చేశారని రాంచంద్రయ్య ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రూ.లక్షన్నర విలువ ఉంటుందన్నారు.

సిలిండర్ పేలి గుడిసె దగ్ధం



బిజినేపల్లి: మండలంలోని మహదేవునిపేటకి చెందిన జుర్రు శ్రీశైలానికి చెందిన గుడిసెలో శుక్రవారం అర్ధరాత్రి సిలిండర్ పేలి దగ్ధమైంది. ఈ ఘటనలో రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు. గ్రామస్తుల కథనం ప్రకారం..బాధితుడు తన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి గుడిసెలో రోజు వారిగా నిద్రిస్తున్నారు. అయితే సిలిండర్ ప్రమాదశావత్తు పేలి గుడిసెకు నిప్పంటుకుంది. అప్పటికే పత్తి పంటను అమ్ముకుని వచ్చిన నగదు, బంగారం కాలిపోయింది. విషయం గమనించిన స్థానికులు అగ్నిమాపక యంత్రానికి సమాచారం అందించడంతో వారు మంటలను అదుపు చేశారు. ఉదయం గుడిసె బయట ఉన్న బాధితులను చూసి గ్రామస్తులు తక్షణ సాయంగా రూ.30వేల సాయం అందించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

సౌత్‌జోన్ ఖో-ఖో పోటీలకు పీయూ జట్టు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్ యూనివర్సిటీ సౌత్‌జోన్ పోటీల్లో భాగంగా బెంగళూరులోని అలయన్స్ యూనివర్సిటీలో ఈనెల 23 నుంచి 26 వరకు జరగనున్న ఖోఖో పోటీల్లో పాల్గొనేందుకు పీయూ మహిళా జట్టు శనివారం బయల్దేరి వెళ్లింది. ఈ మేరకు జట్టు సభ్యులకు పీయూ ప్రిన్సిపాల్ కిషోర్ ట్రాక్‌సూట్‌లు అందజేశారు. సమష్టిగా ఆడి.. విజయంతో తిరిగి రావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీ బాల్‌రాజ్, విష్ణు, మల్లేష్, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2కు ఉచిత శిక్షణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: గ్రూప్-2 పరీక్ష రాసేందుకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీసర్కిల్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు స్టడీసర్కిల్ డైరెక్టర్ స్వప్న ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్, నారాయణ పేట, నాగర్‌కర్నూల్ జిల్లాలకు చెందిన అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం ఈనెల 25 లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

నేటినుంచి జోగుళాంబ బ్రహ్మోత్సవాలు



జోగుళాంబ ఆలయం వద్ద చేసిన ఏర్పాట్లు



రంగురంగుల విద్యుద్దీపాల వెలుగులో ఆలయం

- 26వ తేదీ వరకు కొనసాగింపు
- ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు
- ప్రముఖులకు ఆహ్వానం

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ అమ్మవారి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి 26వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఏటా వసంత పంచమిని పురస్కరించుకొని అయిదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది పాంచాహ్నిక దీక్ష పేరిట బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

కార్యక్రమాలు ఇలా..

ఆదివారం ఉదయం ఆనతి స్వీకరణ, 8 గంటలకు అమ్మవారి యాగశాల ప్రవేశం, పుణ్యాహవాచనం, మహాగణపతి పూజ, రుత్విక్ వరణం, మహాకలశ స్థాపన ఉంటుంది. సాయంత్రం 6 గంటలకు మృత్ సంగ్రహణం, అంకురారోహణం, షట్పాత్ర ప్రయోగం, ధ్వజారోహణం నిర్వహిస్తారు.

- 23 నుంచి 25వ తేదీ వరకు రోజు ఉదయం 8 గంటలకు గణపతి పూజ, ఆవాహిత దేవతాపూజలు, మండపారాధన, హోమాలు, నిత్య బలిహరణం, విశేష అర్చనలు, చండీహోమాలు, పవమానసూక్త పారాయణ సహిత హోమాలు, నిత్య నైవేద్యాలు, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణలు ఉంటాయి.
- 26న అమ్మవారి నిజరూప దర్శనం. అదేరోజు వసంత పంచమి సందర్భంగా గ్రామప్రజలంతా జోగుళాంబ సేవాసమితి ఆధ్వర్యంలో జాతర నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సేవాసమితి తరఫున ముందుగా అమ్మవారికి పట్టువస్త్రాలు, అభిషేక ద్రవ్యాలు సమర్పిస్తారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి యాగశాలలో నిత్యహోమాలకు మహా పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, సహస్ర ఘటాలకు అవాహనం, అర్చన అనంతరం శ్రీ జోగుళాంబ అమ్మవారి మూలవిరాట్‌కు అవభృత స్నపనం, పంచామృత అభిషేకం జరుగుతుంది. ఈ సమయంలోనే అమ్మవారి నిజరూప దర్శనం ఉంటుంది. అదేరోజు ప్రదోశ కాలంలో జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి శాంతి కళ్యాణ మహోత్సవం జరుగుతుంది. అనంతరం ధ్వజ అవరోహణతో కార్యక్రమాలు పరిసమాప్తి అవుతాయి.

ప్రముఖులకు ఆహ్వానాలు..

బ్రహ్మోత్సవాలకు ఇరు తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు ప్రముఖులను ఆహ్వానించారు. ఇందులో కర్నూలు కలెక్టర్, ఎస్పీ, ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు తెలంగాణలో సీఎం కేసీఆర్ సతీమణి శోభ, కుమార్తె కవిత, మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు, సినీనిర్మాత రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్, మాజీ హోంమంత్రి దేవేందర్‌గౌడ్, ఎమ్మెల్యే అబ్రహం, డీకే అరుణ, కేవీ రమణాచార్యులు, బెంగుళూరు మాజీ కలెక్టర్ రామాంజనేయులు, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహచార్యులు, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఆధ్యాత్మిక ప్రవచనకర్త డా. బాచంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రి, సీఎస్ శాంతికుమారి తదితరులను ఆహ్వానించారు.



సీఎం కుటుంబసభ్యులకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న అర్చకుడు

నిజరూప దర్శనం మహాభాగ్యం



వసంతపంచమి రోజున అమ్మవారికి ఎలాంటి అలంకరణ లేకుండా నిర్వహించే అభిషేకం తిలకించడమే నిజరూప దర్శనంగా చెప్పబడుతుంది. ఈ దర్శన భాగ్యం చాలా గొప్పది.

– పురేందర్‌కుమార్, ఈఓ

అన్ని ఏర్పాట్లు చేశాం..



బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. ఆలయ కమిటీ సభ్యులు సమష్టిగా వివిధ పనులుపై దృష్టి సారించడంతో పాటు ప్రముఖులను ఆహ్వానించాం. వారు రావడంతో ఆలయానికి ప్రయోజనం చేకూరడంతో పాటు దేవస్థానానికి మరింత ప్రచారం కలుగుతుందని భావించాం. భక్తుల సహకారంతో భోజనవసతి, ఉచిత ప్రసాద పంపిణీ చేపట్టేలా ఏర్పాట్లు చేశాం.

– శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ చైర్మన్

సహస్ర ఘటాభిషేకంలో మార్పులు..



ఏటా వసంతపంచమి రోజున మాత్రమే సహస్ర ఘటాభిషేకం చేసేవారు. ఈసారి పండితులు, పీఠాధిపతుల సూచన మేరకు ఉత్సవాలు జరిగే 5 రోజుల పాటు సహస్ర ఘటాలను స్థాపిస్తున్నాం. కోతుల బాధ లేకుండా ఈసారి కుంకుమార్చన మండపంలోనే ఘటాభిషేకం పూజలు చేసేలా మార్పులు చేయాలని దేవస్థానం అధికారులకు విన్నవించాం. భక్తులు కూడా మార్పును గమనించి సహకరించాలి.

– విక్రాంత్‌శర్మ, అర్చకుడు

హత్యాయత్నం కేసు చేయాలని ఆందోళన

- బిజినేపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట వట్టెం గ్రామస్తుల నిరసన



వట్టెం గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ హన్మంతు

బిజినేపల్లి: మండలంలోని వట్టెం గ్రామానికి చెందిన రవికుమార్‌ను ఓ వ్యక్తి కారుతో ఢీకొట్టాడు. ప్రమాదానికి గురిచేసిన సంఘటనపై రోడ్డు ప్రమాదం కేసు కాకుండా, హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఆ గ్రామవాసులు శనివారం పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. దీంతో దాదాపు గంట పాటు వనపర్తి రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. జనవరి 16న టీఎస్ 31 ఎఫ్ 0011 అనే కారు నడిపిన వ్యక్తి వట్టెంలో ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నాడు. అలా చేయడం ప్రమాదమని రవికుమార్ అతనికి తెలియజేశాడు. దీంతో ఆ కారు డ్రైవర్ కోపంతో వెనుకాల నుంచి ఢీకొట్టి గాయపర్చాడు. స్థానికులు ప్రమాదాన్ని గమనించి హైదరాబాద్ నిమ్స్‌కు శస్త్రచికిత్స నిమిత్తం తరలించారు. కాగా ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు హత్యాయత్నం కేసు కాకుండా సాధారణ రోడ్డు ప్రమాదంగా కేసు నమోదు చేశారని ఆందోళన చేపట్టారు. కారు డ్రైవరుపై తక్షణమే హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఐ కృష్ణ ఓబుల్‌రెడ్డి వారికి సర్ధిచెప్పి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినా.. వారు ఆందోళన విరమించలేదు. సీఐ హన్మంతు అక్కడకు చేరుకుని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

ఫైనల్‌కు చేరిన క్రికెట్ పోరు

- తలపడనున్న ఢిల్లీ, వీర హనుమాన్(రాయచూర్) జట్లు



ఢిల్లీ-హైదరాబాద్ జట్ల మధ్య కొనసాగుతున్న మ్యాచ్

గద్వాల: స్థానికంగా కొనసాగుతున్న క్రికెట్ మ్యాచ్‌లు తుది దశకు చేరుకున్నాయి. ఢిల్లీ, వీరహనుమాన్(రాయచూర్) జట్లు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి ఫైనల్‌కు చేరుకున్నాయి. నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్(నాటా) సహకారంతో జోగుళాంబ గద్వాల జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైమ్ మినిస్టర్ కప్ టీ-20 క్రికెట్ టోర్నీని నిర్వహిస్తున్నారు. శనివారం స్థానిక సోమనాద్రి స్టేడియంలో జరిగిన రెండో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఢిల్లీ- ముంబయి జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 202 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్‌కు దిగిన ముంబయి జట్టు 110 పరుగులకే ఆలౌట్ అయింది. ఢిల్లీ జట్టు క్రీడాకారుడు భరత శర్మ విధ్వంసకరమైన బ్యాటింగ్‌తో చెలరేగాడు. కేవలం 36 బంతుల్లో 80 పరుగులు చేసి సత్తాచాటి జట్టుకు విజయాన్ని అందించాడు. దీంతో ఢిల్లీ జట్టు సెమిఫైనల్‌కు చేరుకుంది. అనంతరం జరిగిన మొదటి సెమిఫైనల్ మ్యాచ్‌లో బెంగళూరు- వీరహనుమాన్ (రాయచూర్) జట్లు తలపడ్డాయి. వీరి మధ్య మ్యాచ్ హోరాహోరిగా సాగింది. మొదట బ్యాటింగ్ చేసిన బెంగళూరు జట్టు అయిదు వికెట్లను కోల్పోయి 174 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వీర హనుమాన్ (రాయచూరు) జట్టు ఒక ఓవరు మిగిలి ఉండగానే 175 పరుగులు పూర్తిచేసి విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. 89 పరుగులు చేసిన సోహైల్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ దక్కింది. సాయంత్రం జరిగిన రెండో సెమిఫైనల్ మ్యాచ్‌లో ఢిల్లీ-హైదరాబాద్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ జట్టు ఏడు వికెట్లను కోల్పోయి 209 పరుగులు చేసింది. అనంతరం 210 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టు 147 పరుగులతో ఓటమి చవిచూసింది. విజయం సాధించిన ఢిల్లీ జట్టు ఫైనల్‌కు చేరుకుంది. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన ఢిల్లీ క్రీడాకారుడు కువార్ పాతక్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది. ఆదివారం ఢిల్లీ, వీరహనుమాన్(రాయచూర్) జట్లు ఫైనల్‌లో తలపడనున్నాయి. టీసీఏ జిల్లా అధ్యక్షుడు మురారి సోమశేఖర్‌రెడ్డి, బీజేపీ నాయకులు బండల వెంకట్రాములు, కౌన్సిలర్లు త్యాగరాజు, బండల పాండు, టీసీఏ నాయకులు కబీర్‌దాసు నర్సింహ, ప్రవీణ్, అనిల్, శ్రీధర్‌గౌడ్, వెంకు, శోభన్‌గౌడ్, కృష్ణ, జియాఉల్లా తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా అంజన్న శకటోత్సవం

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శనివారం శకటోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఉదయం ఊర్కొండపేటలోని ప్రధాన అర్చకుడు దత్తాత్రేయశర్మ స్వగృహం నుంచి ఉత్సవమూర్తిని పల్లకీలో భాజాభజంత్రీల మధ్య భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు అష్టోత్తరాలతో ధ్వజారోహణం గావించి స్వామివారిని బంగారు ఆభరణాలతో అలంకరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, ఎంపీపీ రాధ, సర్పంచ్ అనిత, ఎంపీటీసీ సభ్యురాలు ఈశ్వరమ్మ, జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, ఆలయ పునరుద్ధరణ కమిటీ సభ్యులు కళమ్మ, రాజేష్, శ్రీనివాస్‌రెడ్డి, రాములు తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించి శకటోత్సవం ప్రారంభించారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభం కావడంతో సదూర ప్రాంతాలతోపాటు పరిసర గ్రామాల ప్రజలు భారీగా తరలివస్తున్నారు. భక్తుల జైహనుమాన్ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కల్వకుర్తి సీఐ సైదులు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు లక్ష్మణ్, రాజు బందోబస్తు కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో నాగోజీ, కృష్ణగౌడ్, గిరినాయక్, జంగయ్య, రవీందర్, రమేష్, పర్వత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధ్వజారోహణానికి పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి



ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ఎద్దుల బండ్లు

హంసవాహనంపై స్వామివారు



హంసవాహన సేవలో లక్ష్మీనరసింహస్వామివారు

కొల్లాపూర్ రూరల్: సింగోటంలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి ఆలయ సమీపంలో ఉన్న శ్రీవారి సముద్రంలో హంసవాహన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి ఉత్సవ విగ్రహాలను శ్రీవారి సముద్రంలో ఉన్న లాంచీలో ఆసీనులను చేశారు. వేద పండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లక్ష్మణ్‌రావు, అర్చక సంఘం జిల్లా అధ్యక్షులు సంపత్ కుమార్ శర్మ పాల్గొన్నారు.

సంచార జాతుల సంక్షేమానికి కృషి

- అణగారిన విముక్త సంచార జాతుల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలి
- విముక్త సంచార జాతుల అభివృద్ధి, సంక్షేమ బోర్డు సభ్యుడు తురక నర్సింహ



మాట్లాడుతున్న తురక నర్సింహ

నాగర్‌కర్నూల్: దేశంలో ఆర్థిక, సామాజిక అసమానతలు పెరిగిపోయాయని వాటిని తొలగించడానికి అణగారిన విముక్త సంచార జాతుల పిల్లలకు మెరుగైన విద్యా ప్రమాణాలు, నాణ్యమైన విద్యను అందించాల్సి ఉంటుందని విముక్త సంచార జాతుల అభివృద్ధి, సంక్షేమ బోర్డు సభ్యుడు తురక నర్సింహ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో విముక్త సంచార జాతుల ప్రజలు ఎంతమంది ఉన్నారు, ఏ ఏ జాతులు తెగల వారు ఉన్నారు, వారి ఆర్థిక సామాజిక పరిస్థితులు ఎలా ఉన్నాయి, వారికి ప్రభుత్వం ద్వారా ఇచ్చిన అసైన్డ్ భూములు ఎంత, అవి ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయి, ఎంత మంది కబ్జాలో ఉన్నారు అనే పూర్తి నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంచార జాతులను ఆదుకుంటామని సంచార జాతులైన సింధు, బుడగ జంగాలు, వడ్డెర, దొమ్మరి, మేదరి, బుడుగ బుడకలకు చెందిన వారు వివిధ గ్రామాల్లో సంచారం చేస్తూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. ఈ కులాల అభివృద్ధికి ఏం చర్యలు తీసుకోవాలో కేంద్రానికి నివేదిస్తామన్నారు. సంచార కులాల్లో ఎస్సీ, బీసీలే ఎక్కువగా ఉన్నారని, కళాకారులు, కళా పోషకులను తాము గుర్తించామని, వీరి అభ్యున్నతికి వివిధ పార్టీల నాయకులు తోడ్పాటు అందించాలని కోరారు.

విద్యార్థుల దిశను మార్చే శక్తి ఉపాధ్యాయులకే..

ఉపాధ్యాయులతో ఆయన గణితం, ఫిజికల్ సైన్స్, బయోసైన్స్, సోషల్ సబ్జెక్టులపై ఇంటరాక్ట్ అవుతూ జాతీయ విద్యా విధానంలో మార్పులు చేర్పులకు సబ్జెక్టుల వారీగా సలహాలు సూచనలు అందించాలని ఆయన కోరారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా ఉంటూ తరగతి గదిలో విద్యార్థులు ప్రశ్నలు అడిగేటట్లు చేయాలని, దేశ చరిత్ర నాగరికత చాలా గొప్పది అని ప్రతి విద్యార్థికి చరిత్ర తెలిసేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. దేశ చరిత్రను ప్రతిబింబించే కట్టడాలను చూపించి దేశంపై ప్రేమ మక్కువను పెంచాలన్నారు. ఉపాధ్యాయులకు విద్యార్థుల దిశను మార్చే శక్తి ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రామేశ్వర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, జీసిసి మేనేజర్ సంతోష్, జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్ గోపిడి, డీఈఓ గోవిందరాజులు, డీపీఓ కృష్ణ, డీఎంహెచ్వో సుధాకర్ లాల్, డీపీఆర్ఓ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరంలో ప్రత్యేక పూజలు

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో శనివారం కేంద్ర సంచార జాతుల అభివృద్ధి, సంక్షేమ బోర్డు సభ్యుడు తురక నర్సింహ ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ఈఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పాపనాశిని గుండం వద్ద పుణ్య స్నానమాచరించి గణపతిపూజ, అమ్మవారికి కుంకుమార్చన, శివుడికి అభిషేకాలు చేశారు. ఆలయానికి మొదటిసారిగా వచ్చిన ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయ చరిత్ర గురించి ఈఓ వివరించారు. ఈ సందర్భంగా తురక నర్సింహ మాట్లాడుతూ దేశంలో వెనకబడిన సంచార జాతుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అర్హులైన వారికి సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామన్నారు. ఆయన వెంట ఆర్డీఓ పాండునాయక్, డీటీడీఓ అనిల్ ప్రకాష్, తహసీల్దార్ కృష్ణయ్య, ఏటీడీఓ కమలాకర్‌రెడ్డి, హెచ్‌డబ్ల్యూఓ జిల్లా ప్రెసిడెంట్ శ్రీరాంనాయక్ తదితరులున్నారు.

క్లుప్తంగా...

లింగమంతుల జాతర దేవరపెట్టెకు పూజలు



చీకటాయపాలెంలో దేవరపెట్టెకు పూజలు నిర్వహిస్తున్న ఉషా దయాకర్‌రావు

తొర్రూరు: సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని దురాజ్‌పల్లి లింగమంతుల జాతరకు తీసుకెళ్లే దేవరపెట్టెకు శనివారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చీకటాయపాలెం గ్రామంలో తండు వంశస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సతీమణి ఉషా దయాకర్‌రావు పూజలో పాల్గొన్నారు. ఈ జాతరకు తొర్రూరు మండలం నుంచి తండు వంశస్తులు దేవరపెట్టెను తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది.

యాదాద్రిలో హైకోర్టు జడ్జి మాధవిదేవి



యాదగిరిగుట్ట: రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ మాధవిదేవి శనివారం కుటుంబ సభ్యులతో కలిసి యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు, అధికారులు ఆమెకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆమె గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకున్నారు. ముఖ మండపంలో ఉత్సవమూర్తుల వద్ద అష్టోత్తరం, సువర్ణ పుష్పార్చన తదితర పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. జస్టిస్ మాధవిదేవికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

వచ్చే నెల 13న రాష్ట్రానికి మోదీ!

▶ మొదటి పేజీ తరువాయి

మంత్రులు, బీఆర్‌ఎస్ నేతలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టే అవకాశం ఉందని అంటున్నారు.

మోదీ పాల్గొనే కార్యక్రమాలివీ!

ఇంతకుముందే ఖరారైన పర్యటన ప్రకారం ప్రధాని మోదీ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయాల్సి ఉంది. అందులో వందేభారత్ రైలును ఇప్పటికే ప్రారంభించినందున.. మిగతా కార్యక్రమాల షెడ్యూల్ సిద్ధమవుతున్నట్టు తెలిసింది. మొత్తంగా రూ.7,076 కోట్ల విలువైన ప్రాజెక్టులకు పచ్చజెండా ఊపనున్నట్టు సమాచారం.

- రూ.1,410 కోట్లతో సికింద్రాబాద్–మహబూబ్‌నగర్ మధ్య నిర్మించిన డబుల్ లైన్ జాతికి అంకితం. ఐఐటీ హైదరాబాద్‌లో రూ. 2,597 కోట్లతో చేపట్టిన వివిధ నిర్మాణాలను (అడ్మిన్‌బ్లాక్, అకడమిక్ బిల్డింగ్స్, హాస్టళ్లు, క్వార్టర్స్, టెక్నాలజీ రిసెర్చ్ పార్కు, టెక్నాలజీ ఇన్నోవేషన్ పార్కు, రిసెర్చ్ సెంటర్ కాంప్లెక్స్, కన్వెన్షన్ సెంటర్, నాలెడ్జ్ సెంటర్, గెస్ట్‌హౌస్, లెక్చర్ హాల్ కాంప్లెక్స్, క్యాంపస్ స్కూల్, లేబోరేటరీ, హెల్త్‌కేర్ ఫెసిలిటీ) జాతికి అంకితం
- రూ.699 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ (ఆధునీకరణ) అభివృద్ధి పనులకు భూమిపూజ.
- రూ.521 కోట్ల వ్యయంతో కాజీపేటలో నిర్మించనున్న రైల్వే పీరియాడికల్ ఓవర్ హాలింగ్ వర్క్‌షాప్‌కు శంకుస్థాపన. రూ.1,336 కోట్లతో చేపట్టిన మహబూబ్‌నగర్–చించోలి 2/4 లేన్ల రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన
- రూ.513 కోట్ల వ్యయంతో నిజాంపేట–నారాయణఖేడ్–బీదర్ సెక్షన్ జాతీయ రహదారి విస్తరణ పనులకు భూమిపూజ
- తెలంగాణకు మరిన్ని ఎంఎంటీఎస్ రైళ్లు, శంషాబాద్ (ఉందానగర్) వరకు ఎంఎంటీఎస్ సేవలు, మేడ్చల్ వరకు ఎంఎంటీఎస్ సేవల పొడిగింపు, రైళ్ల సంఖ్య పెంపు, కాచిగూడ నుంచి విశాఖపట్నం ట్రైన్ మహబూబ్‌నగర్ వరకు పొడిగింపు వంటి ప్రకటనలు వచ్చే అవకాశం ఉంది.

సింగరాయ జాతరకు పోటెత్తిన భక్తులు

వంకాయ కూర, చింతపండు చారుతో భోజనాలు





స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు. ఇన్‌సెట్‌లో వంకాయ కూర వండుతున్న భక్తురాలు


సాక్షి, సిద్దిపేట: సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని ప్రతాపరుద్ర సింగరాయ లక్ష్మీనరసింహస్వామి జాతరకు శనివారం భక్తులు పోటెత్తారు. రాష్ట్రం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గోవింద నామస్మరణతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. భక్తులు తొలుత మోయతుమ్మెద వాగులో స్నానం చేసి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం వాగు పక్కన చెలమను తోడి అందులో నుంచి తీసిన నీటితో వంకాయ కూర, చింతపండు చారు చేసుకొని అక్కడే భోజనాలు చేశారు. మరికొందరు వంకాయ, చిక్కుడు, టమాటాలను కలిపి కూర చేసుకోవడం గమనార్హం. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు జాతర సాగింది. జాతరకోసం ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.

రాష్ట్రంలోనే ఐటీ జాబ్స్ అధికం

రాష్ట్ర ఐటీ ఇన్వెస్ట్‌మెంట్స్ సీఈవో విజయ్‌రంగినేని

సాక్షి, ఆదిలాబాద్: మొదటిసారి బెంగళూరుతో పోల్చితే తెలంగాణలోనే ఐటీ జాబ్స్ ఎక్కువ ఉన్నాయని రాష్ట్ర ఐటీ ఇన్వెస్ట్‌మెంట్స్ సీఈవో విజయ్ రంగినేని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 'ఫ్రెండ్లీ గవర్నమెంట్ –ఫ్రెండ్లీ పాలసీ' కారణంగా ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లోని ఐటీ కంపెనీ బీడీఎస్‌టీ సీఈవో సంజీవ్ దేశ్‌పాండే సౌజన్యంతో కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) తెలంగాణ ఆధ్వర్యంలో స్టార్టప్ ఎకో సిస్టం పై ఐటీ కంపెనీ ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలతో జిల్లా కేంద్రంలో శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఐటీ ఇన్వెస్ట్‌మెంట్స్ పెరిగాయని, బెంగళూరుతో పోలిస్తే హైదరాబాద్‌లో 10 నుంచి 12 శాతం ఖర్చు తక్కువ కావడంతోనే పలు ఐటీ కంపెనీలు ముందుకు వస్తున్నాయన్నారు. టైర్–2లో భాగంగా అన్ని జిల్లాలకు ఐటీ విస్తరించాలన్నది ప్రభుత్వ ధ్యేయమన్నారు.

9వ నిజాంగా మహ్మద్ అజ్మత్ అలీఖాన్



సాక్షి, హైదరాబాద్: నిజాం 9వ వారసుడి పట్టాభిషేకం శుక్రవారం రాత్రి చౌమహల్లా ప్యాలెస్‌లో సాదాసీదాగా జరిగింది. ఇటీవల 8వ నిజాం ముకరంజా బహదూర్ కన్నుమూయడంతో ఆయన పెద్ద కుమారుడు మహ్మద్ అజ్మత్ అలీఖాన్ అజ్మత్ జాను 9వ నిజాంగా ప్రకటించారు. నిజాం సంస్థానానికి సంబంధించిన వ్యవహారాలను కట్టబెడుతూ నిజాం కుటుంబ సభ్యులు, ట్రస్టీ సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. దీనికి అనుగుణంగా చౌమహల్లా ప్యాలెస్‌లో ఈ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఇక నుంచి అజ్మత్ అలీఖాన్ నిజాం ఆస్తులు, ఇతరత్రా వ్యవహారాలు పర్యవేక్షించనున్నారు.

11 నుంచి ఓయూ డిగ్రీ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ఉస్మానియా యూనివర్సిటీ డిగ్రీ పరీక్షల టైం టేబుల్‌ను విడుదల చేశారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ (సీబీసీఎస్) రెగ్యులర్ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 11 నుంచి ప్రారంభం కానున్నాయి. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరిగే పరీక్షలకు వారం రోజుల ముందుగా హాల్‌టికెట్లు జారీ చేయనున్నారు. ఈనెల 24 వరకు ఎలాంటి రుసుము లేకుండా, ఈనెల 28 వరకు రూ.500 ఆలస్య రుసుముతో ఫీజు చెల్లించవచ్చు.

ప్రైవేటు ఉద్యోగ కార్మికులకు అండగా ఉంటాం: హరీశ్

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు ఉద్యోగ కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం డైరీని మంత్రి ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ప్రైవేటు ఉద్యోగులు ప్రముఖ పాత్ర పోషించారన్నారు. భారత్ రాష్ట్ర సమితి ఏర్పాటు తర్వాత కూడా ఈ సంఘం పలు రాష్ట్రాల్లో శాఖలను నిర్మించుకోవడం శుభ పరిణామమని మంత్రి హరీశ్‌రావు అభినందించారు.

'దావోస్' పెట్టుబడులు రూ. 21 వేల కోట్లు



తన బృందంతో మంత్రి కేటీఆర్

పర్యటన విజయవంతం: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల్లో తెలంగాణ ప్రభుత్వం రూ. 21 వేల కోట్ల మేర పెట్టుబడులను సాధించినట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె. తారక రామారావు పేర్కొన్నారు. తనతోపాటు అధికారుల బృందం 4 రోజులపాటు అక్కడి సమావేశాల్లో పాల్గొని తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించినట్లు ఆయన ట్విట్టర్‌లో వివరించారు. అంతర్జాతీయ, దేశీయ దిగ్గజ కంపెనీలకు చెందిన చైర్మన్లు, సీఈఓలు తదితరులతో 52 సమావేశాలు, 6 రౌండ్‌టేబుల్ సమావేశాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. దావోస్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్‌ను బహుళజాతి కంపెనీల ప్రతినిధులు, ఆర్థిక నిపుణులు, విధానాల రూపకర్తలు సందర్శించారు. తెలంగాణ భౌగోళిక స్వరూపం, మౌలిక వసతులు, కాళేశ్వరం ప్రాజెక్టు, ప్రభుత్వ విధానాలపై రూపొందించిన ప్రత్యేక వీడియోలను ఈ పెవిలియన్‌లో ప్రదర్శించారు.

యువతకు భారీగా ఉద్యోగాల కోసం..

వరుసగా ఐదోసారి వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాలకు హాజరైన కేటీఆర్... దావోస్‌లో అడుగు పెట్టింది మొదలు వరుసగా వివిధ దిగ్గజ కంపెనీల అధినేతలతో ముఖాముఖి చర్చలు జరిపారు. దావోస్ పర్యటన మార్గమధ్యలో స్విట్జర్లాండ్‌లోని అతిపెద్ద నగరమైన జూరిచ్‌లో ప్రవాస భారతీయులతో ప్రత్యేకంగా కేటీఆర్ సమావేశమయ్యారు. తెలంగాణకు పెట్టుబడులతో రావాల్సిందిగా వారిని ఆహ్వానించారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తెచ్చి పెద్ద ఎత్తున యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ఆలోచనే నిరంతరం తమను నడిపిస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు. దావోస్ పర్యటనకు వెళ్లిన కేటీఆర్ బృందం శనివారం హైదరాబాద్‌కు చేరుకుంది.

దావోస్‌లో రాష్ట్రం సాధించిన పెట్టుబడులు

- హైదరాబాద్‌లో మరో 3 డేటా సెంటర్ల ఏర్పాటు కోసం మైక్రోసాఫ్ట్ రూ. 16 వేల కోట్ల పెట్టుబడి ప్రకటన.
- హైదరాబాద్‌లో హైపర్‌స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు భారతీ ఎయిర్‌టెల్ గ్రూప్ రూ. 2 వేల కోట్ల ఇన్వెస్ట్‌మెంట్.
- రూ. వెయ్యి కోట్లతో హైదరాబాద్ కేంద్రంగా భారతీయ మార్కెట్‌లోకి ఫ్రాన్స్ ఔషధ పరిశోధన, తయారీ సంస్థ యూరోఫిన్స్ విస్తరణ
- లండన్ తరువాత హైదరాబాద్‌లో అపోలో టైర్స్ డిజిటల్ ఇన్నోవేషన్ సెంటర్.
- రూ.210 కోట్ల పెట్టుబడితో అలాక్స్ అడ్వాన్స్ మెటీరియల్స్ మల్టీ గిగావాట్ లిథియం క్యాథోడ్ మెటీరియల్ తయారీ కేంద్రం
- తెలంగాణలో పెప్సీకో కార్యకలాపాలు రెట్టింపు
- హైదరాబాద్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక నాలుగో పారిశ్రామిక విప్లవానికి సంబంధించిన కేంద్రం
- హైదరాబాద్‌లో రూ. 150 కోట్లతో రీహాబిలిటేషన్ థెరపీలో రోగులు, వైద్య సంస్థలకు అవసరమయ్యే డిజిటల్ సేవలను అందించే వెబ్‌పీటీ ప్రపంచ సామర్థ్య కేంద్రం.

ఆస్పత్రిని శుభ్రపరచండి

మందుబాబులకు న్యాయమూర్తి శిక్ష

మంచిర్యాల క్రైం: సాధారణంగా మందు కొట్టి వాహనం నడిపి పట్టుబడితే.. జరిమానా విధిస్తారు.. కానీ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 13 మంది మందుబాబులు ఆస్పత్రిలో శుభ్రత పనులు చేయాలని మంచిర్యాల జిల్లా న్యాయమూర్తి శనివారం తీర్పు చెప్పారు. మంచిర్యాలలో ఇటీవల ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై ట్రాఫిక్ సీఐ నరేశ్‌కుమార్ కేసులు నమోదు చేసి శనివారం కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం 13మంది మందుబాబులు రెండ్రోజులపాటు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మాతాశిశు కేంద్రంలో శుభ్రత పనులు చేయాలని న్యాయమూర్తి ఉపనిషధ్వని శనివారం తీర్పు చెప్పారు. లేనిపక్షంలో పది రోజుల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. శిక్ష పడిన వారిలో మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌కు చెందిన బొమ్మ మొగిలి, మంచిర్యాల కాలేజీ రోడ్‌కు చెందిన చిలుక శ్రీహరి, తిలక్‌నగర్‌కు చెందిన బిబ్బర సతీష్, హమాలీవాడకు చెందిన అలుగోజు వీరాచారి, జాఫర్‌నగర్‌కు చెందిన ఎండీ షర్ఫొద్దీన్, ఎల్‌ఐసీ కాలనీకి చెందిన ఎండీ మాజీద్‌ఖాన్, మందమర్రికి చెదిన పిట్టల సాంబయ్య, ఆడెపు లక్ష్మణ్, ఆనంద్ రాపర్తి, కుమురంభీం జిల్లా రెబ్బెనకు చెందిన గోళం రమేష్, భీమారం మండలం ఆరెపల్లికి చెందిన ఎల్‌డీ మహేందర్, పులిమడుగుకు చెందిన పెద్ది సురేష్, తాండూర్‌కు చెందిన భీమ సతీష్‌కుమార్ ఉన్నారు.

ఎనిమిదేళ్లలో ఎకరా భూమికి నీరివ్వలేదు



పాలమూరు: బీజేపీ కార్యకర్తల పార్టీ అని, కార్యకర్తలు బలంగా ఉంటే పోటీచేసే అభ్యర్థులకు కొదవలేదని జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ గార్డెన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమ, మంగళవారాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు నిర్వహిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నేతలు హాజరవుతారని చెప్పారు. పాలమూరు పార్లమెంట్ స్థానం నుంచి ప్రధానమంత్రి మోదీ పోటీ చేస్తే తెలంగాణతో పాటు ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ వంటి ప్రాంతాలు అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. పాలమూరులో మోదీ పోటీ విషయాన్ని జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా దృష్టికి తీసుకెళ్లామన్నారు. పాలమూరు ప్రాంత సమస్యలను చూపించి సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని నడిపించారని, ఇక్కడ ఎంపీగా ఉన్న సమయంలో తెలంగాణ వచ్చినా.. ఈ ప్రాంత సమస్యలను పట్టించుకోలేదన్నారు. కృష్ణాజలాల నుంచి 24 లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తానని చెప్పి ఎనిమిదేళ్లు గడిచినా ఎకరా భూమికి నీళ్లు పారించలేదన్నారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గ సమావేశాలకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్, జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, నాయకులు బాలరాజు, శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9.30గంటలకు జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో పుస్తకావిష్కరణ కార్యక్రమం ఉంటుందని ఆ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిగామ కిషోర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సాహితీ జిల్లా అధ్యక్షులు కవి ఖాజా మైనుద్దీన్ రచించిన 'ఆమె మార్పు ఎజెండా', చల్లారని నిప్పు రవ్వలు' పుస్తకాలను ముఖ్య అతిథులు వైద్యం భాస్కర్, రచయిత్రి ఉషారాణి ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సాహిత్య అభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

లక్ష్మీచెన్నకేశవుడి బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

- నేటి నుంచి 30 వరకు గంగాపురం జాతర
- 25న తిరుకల్యాణం, 27న పుష్పరథం, 28న రథోత్సవం
- 29న శకటోత్సవం, 10 చక్రస్నానంతో ఉత్సవాల ముగింపు
- భక్తులకు ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం



గంగాపురంలోని చెన్నకేశవస్వామి ఆలయం



చెన్నకేశవస్వామి మూలవిరాట్

జడ్చర్ల టౌన్: కృతయుగంలో మత్స్యపురంగా.. త్రేతాయుగంలో దురితకోలాహలంగా.. ద్వాపర యుగంలో మాయాపురంగా పిలవబడి.. కలియుగంలో గంగాపురంగా మారిన శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతిఏటా మాఘశుద్ధ పాడ్యమి మొదలు నవమి వరకు ఉత్సవాలు కొనసాగుతాయి. వైష్ణవ పాంచరాగమ సంప్రదాయానుసారం ఉత్సవాలు నిర్వహిస్తారు. ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కోవిడ్ నిబంధనలు తొలగిన తర్వాత నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశాలు ఉన్నాయి. ఉత్సవాలకు ఆలయం పడమర ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తారు. అదేవిధంగా తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి సైతం భక్తులు రానున్నారు.

10వ శతాబ్దంలో..

జడ్చర్ల మండలం గంగాపూర్‌లోని శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయం నాటి శిల్పుల కళానైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ ఆలయం 10వ శతాబ్దంలో నిర్మించినట్లుగా ఆనవాళ్లున్నాయి. కోనార్క్ సూర్యదేవాలయం, గంగాపూర్ లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయం ఒకే విధంగా నిర్మించారని ప్రతీతి. ఆలయం చతురస్రాకారంలో నిర్మితమై ఉండటం ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్మించిన కోనేరు పలు ప్రత్యేకతలను చాటుతోంది. చతురస్రాకారంలో మెట్లు నిర్మించడం వల్ల ఎటు నుంచి చూసినా కోనేరు ఒకేలా కనిపించడం విశేషం.

ఏర్పాట్లు పూర్తి

రాష్ట్రంలో పేరుగాంచిన చెన్నకేశవస్వామి ఆలయాల్లో ఒకటైన గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఆదివారం ప్రారంభమై నెలాఖరున ముగియనున్న జాతర కోసం ఆలయ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో పెయింటింగ్, శుద్ధి చేసే ప్రక్రియ, ప్రాకారాలు, కోనేరు ఇతర నిర్మాణాలకు 40 మందితో జాజు పూయడం వంటివి బుధవారం పూర్తిచేశారు. ఆలయ ప్రాంగణం, వెనకాల భక్తులు వంటావార్పు చేసుకునేందుకు గానూ చదును చేసి సిద్ధంగా ఉంచారు. కోనేటిలో భక్తులు స్నానాలు ఆచరించేందుకు పాతనీటిని బయటకు పంపించి కొత్తనీటిని నింపుతున్నారు.

సర్వం సిద్ధం చేశాం..

లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేశాం. కోవిడ్ నిబంధనలు తొలిగాక జరిగే ఉత్స వాలు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేశాం. జాతర కోసం ప్రత్యేక బ స్సులు నడిపించాలని ఆర్టీసీ అధికారులను కోరాం. అలాగే రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య, ఆరోగ్య శాఖల సహకారం తీసుకుంటున్నాం.

– శ్రీనివాసరాజు, బ్రహ్మోత్సవాల ఇన్‌చార్జ్, గంగాపూర్ ఆలయం

బ్రహ్మోత్సవాలు ఇలా..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మొదటిరోజు స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర శతకలశాభిషేకం, నూతన వస్త్రాల అలంకరణతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. సోమవారం విశ్వక్సేన పూజ, పుణ్యాహావచనం, కంకణధారణ, మృత్సంగ్రహణం, అంకురార్పణం, అగ్నిప్రతిష్ఠ, పల్లకీసేవ నిర్వహిస్తారు. మంగళవారం ధ్వజారోహణం, ప్రాణప్రతిష్ఠ, బలిహరణం, బుధవారం ఎదుర్కోళ్లు, స్వామి, అమ్మవార్ల కల్యాణం, గురువారం మనోహరమైన శేషవాహనసేవ, శుక్రవారం పుష్పరథం (చిన్నతేరు), వచ్చే శనివారం పెద్దతేరు (రథోత్సవం), వచ్చే ఆదివారం శకటోత్సవం (బండ్లు తిప్పుట), సోమవారం చక్రతీర్థంతో ఉత్సవాలు ముగుస్తాయి.

మార్మోగిన గోవింద నామస్మరణ



కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట: అమావాస్యను పురస్కరించుకుని తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవమైన అమ్మాపురం కురుమూర్తి స్వామిని దర్శించుకునేందుకు శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి ఉదయాన్నే తరలివచ్చి క్యూలైన్లో నిల్చున్నారు. మెట్లపై దీపాలు వెలిగించి గోవింద నామస్మరణలతో స్వామి చెంతకు చేరి కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చున్నారు. కొండదిగువన దాసంగాలు పెట్టి తమ పిల్లాపాపలు చల్లంగా ఉండాలని, పంటలు బాగా పండాలని వేడుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించారు. దీంతో గుట్టపైన అలువేలు మంగమ్మ, ఆంజనేయ స్వామి, చెన్నకేశవ స్వామి, ఉద్దాల మండపం వద్ద భక్తులు దర్శించుకున్నారు. భక్తులు ఇబ్బందులకు గురికాకుండా ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.

నల్లమల.. కిటకిట



ఉమామహేశ్వరంలో పూజలు



నిరంజన్ షావలీ దర్గాలో ప్రార్థనలు

- కొనసాగుతున్న ఉర్సు, బ్రహ్మోత్సవాలు
- భారీగా తరలివస్తున్న భక్తులు
- నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటూ..

అచ్చంపేట: అచ్చంపేట మండలం రంగాపూర్ నిరంజన్‌షావలీ ఉర్సు వైభవంగా కొనసాగుతోంది. నాలుగోరోజు శనివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉర్సు ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు దర్గాకు భక్తుల తాకిడి ఏ మాత్రం తగ్గలేదు. మంగళవారం రాత్రి నుంచి శుక్రవారం వరకు సుమారు 1.50 లక్షల మంది భక్తులు దర్గాను సందర్శించుకున్నారు. పలువురు భక్తులు పొట్టేళ్లను బలిచ్చి ఫాతేహాలు, కందూర్లు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కోరిన కోర్కెలు తీరాలంటూ చెట్టుకు ముడుపులు కడుతున్నారు. రంగాపూర్ ఉర్సు, ఉమామహేశ్వరం బ్రహ్మోత్సవాలు ఒకేసారి ప్రారంభం కావడంతో నల్లమల ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది. సంక్రాంతికి వచ్చిన బంధుమిత్రులు ఈ ప్రాంతంలో కొనసాగుతున్న రెండు ఉత్సవాలను తిలకించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఉమామహేశ్వర క్షేత్రం..

శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాపనాశిని గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి గణపతి, ఉమాదేవి, ఉమామహేశ్వరస్వామి, కాళికాదేవి, అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి అర్చనలు, విశేష పూజలు, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. శనివారం ఉత్తరాయణ పుణ్యకాల స్నానాలు, ప్రత్యేక పూజలు వేద పండితుడు వీరయ్యశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. వేడుకలను చైర్మన్ కందూరు సుధాకర్, ఈఓ శ్రీనివాసరావు పర్యవేక్షిస్తున్నారు.

26నుంచి కుండలినియోగంపై సదస్సు



కుండలినియోగ ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న స్వామి

జడ్చర్ల టౌన్: ఈనెల 26 నుంచి మూడు రోజుల పాటు మండలంలోని గొల్లపల్లి సద్గురు మళయాళ స్వామి లలితాంబికా తపోవనంలో సింపోసియం, కుండలిని యోగంపై తొలిసారిగా అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు స్వామి సర్వేశ్వరానందగిరి తెలియజేశారు. తపోవనంలో శనివారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోనే తొలిసారిగా కుండలిని యోగం వల్ల దేహము, మనసు, ఆత్మలపై కలిగే ఫలితాల గూర్చి సదస్సులో చర్చించనున్నట్లు వెల్లడించారు. కుండలినియోగంపై పలు సందేహాలు ఉన్నాయని వాటిని తీర్చనున్నట్లు చెప్పారు. తమ గురువు సద్గురు తపోవనం స్థాపకులు స్వర్గీయ రామేశ్వరానందగిరి తను నేర్పిన కుండలినియోగంను కొంతమందికి నేర్పించాననని, దానివల్ల వారు పొందిన ఫలితాలను సదస్సులో వివరిస్తారన్నారు. సదస్సులో దేశంలోని వివిధప్రాంతాల నుంచి యోగులు, రుషులు వస్తారని, విద్యావేత్తలు, వైద్యరంగంలో నిష్ణాతులు హాజరవుతారన్నారు. అలాగే అమెరికాతోపాటు మరికొన్ని ప్రాంతాల నుంచి వర్చువల్ ద్వారా సందేశాలు ఇస్తారన్నారు. మూడు రోజుల సదస్సులో పాల్గొనేందుకు శ్రీకాంత్ ఫోన్ నెం.9000425007 సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్‌లో ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు కొకుంట్ల శ్యాం, బుచ్చిలింగంలు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.